సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులకు సిఎం సహాయ నిధి నుంచి రూ.2.95 లక్షలు మంజూరయ్యాయి. వీటిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం రామచంద్రపురంలో క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. మంత్రి మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాయం అందించిన సిఎం చంద్రబాబుకి, నిధులు మంజూరుకు సహకరించిన మంత్రి సుభాష్‌కు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిబంధనలకు నీళ్లు

- గుడి లేదు.. బడి లేదు..
- నివాసాల చెంతనే మద్యం షాపులు
- మహిళల్లో పెరుగుతున్న వ్యతిరేకత

ప్రజాశక్తి-అమలాపురం

గడిచిన వైసిపి ప్రభుత్వంలో మద్యం ధరలు విపరీతంగా పెంచారని నాణ్యమైన మద్యం సరఫరా చేయలేదంటూ ప్రస్తుత అధికార టిడిపి నాయకులు గత ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మద్యం అంశాన్ని వాడుకోవడం జరిగింది. మేము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ప్రచారం చేశారు కూడా.నూతన మద్యం షాపుల విధానం ప్రకారం 2024 - 26 సంవత్సరములకు గాను అంటే రెండు సంవత్సరాల కాల పరిమితి చొప్పున జిల్లాలో మద్యం దుకాణాలు కేటాయింపు లక్కీ డ్రా ప్రక్రియ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించారు. జిల్లాలోని 133 మద్యం దుకాణాలకు 4087 దరఖాస్తులు దాఖలు చేయగా 133 మద్యం షాపులకు లక్కీ డ్రా ద్వారా 133 మందిని ఎంపిక చేశారు. ఇక్కడ వరకు అంతా బానే ఉంది కానీ నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు బెల్ట్ షాపులు పాఠశాలలకు దేవాలయాలకు నివాస స్థలాలకు ప్రభుత్వ నిబంధన మేరకు ఉండాల్సిన కనీస దూరంలో లేకుండా గుడి పక్కన బడి పక్కన ప్రధాన హైవే పక్కన కూడా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు.

మద్యం దుకాణాలు తొలగించాలని ధర్నా

కొత్తపేట మండలం అవిడి రేవుకు చెందిన బొక్కా శాంత కుమారి ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ ఇంటి వెనక వున్న మద్యం షాపును తొలగించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అవిడిరేవులో వేసిన లే అవుట్లో స్థలం కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకుంటున్నామని మా ఇంటి వెనక మద్యం షాపు పెట్టి మా ఇంటికి వెళ్లే దారులు మూసివేసి మా ఇండ్లను అమ్మివేయాలని, రాత్రులు మా ఇంటి కరెంట్ సర్వీస్ వైర్లు కట్ చేసి మా ఇండ్లకు కరెంట్ రాకుండా చేయడం, కాలనీలో కొత్తగా ఇండ్లు నిర్మాణం చేసుకుంటే వాటి పైన అక్రమ కేసులు పెట్టిందని, సర్వేలు చేయించి ఇండ్ల నిర్మాణం చేసుకోకుండా అడ్డుపెట్టి కొత్తగా ఎవరు కరెంటు మీటర్లు ఇవ్వకుండా ఆపి వేస్తున్నారని వాపోయారు. గతంలో మేము కట్టిన ఇంటి పన్నులు గ్రామ పంచాయతీ వారు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఇన్ని ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయినా మేము తట్టుకుని ఇక్కడే నివాసం ఉంటున్నా మమ్మల్ని ఇక్కడ నుండి ఎలాగైనా వెళ్లగొట్టాలని మాపై కక్ష కట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అధికారులు అక్కడ నుండి మద్యం షాపు తొలగిస్తామని వారిని శిక్షించి మీకు న్యాయం చేస్తామని హామీలు ఇస్తూనే ఉన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారు కొత్త పోలీస్ లో 10 రోజుల్లో షాపును తొలగిస్తామని కొత్త షాపును కూడా అక్కడ పెట్టమని మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీలు అమలు కాలేదన్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, మహిళలు

అమలాపురం మండలం కామనగరువు బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన వైన్ షాప్‌ను తొలగించి వేరొక ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని అమలాపురం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రమా ఆమని ట్రేడర్స్, ఆమనీ ఆటో ఏజెన్సీస్‌లో పనిచేసే కార్మికులు, మహిళలు నిరసన తెలిపారు.

మద్యం షాపులు తొలగించాలని అక్టోబర్ 24న ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మహిళలు

కామనగరువు బైపాస్ రోడ్ ఆనుకునే ఏర్పాటు చేసిన వైన్ షాప్ వల్ల ఆమని ఆటో ఏజెన్సీలో పని చేస్తున్న కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, పక్కనే గుడి ఉన్నందున భక్తులకు అసౌకర్యం కలగడమే కాకుండా దారిని వెళ్లే స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.వైన్ షాప్ ఏర్పాటు వల్ల బైపాస్ రోడ్‌లో యాక్సిడెంట్లు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి వైన్ షాప్ ను వేరే ఒక చోటికి మార్చాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

బెల్ట్ షాపు నిర్వహణపై ఆందోళన

అమలాపురం రూరల్ మండలం బండారులంక జెడ్‌పి హైస్కూల్ సమీపంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు బెల్ట్ షాప్ లు అరికట్టాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.ఈ బెల్ట్ షాపులు తెల్లవారు జామున 5 గంటల నుంచి మద్యం అమ్ముతున్నా పోలీ సులు పట్టించుకోవట్లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండారులంకలో ఉన్న కిళ్లీ షాపులో 60 శాతానికి పైగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయని గ్రామస్తుల ఆందోళన చెందు తున్నారు.

బెల్ట్ షాపుల ఏర్పాటుకు వేలంపాటలు

రాష్ట్రంలో ఎక్కడ బెల్ట్ షాపులు ఉండకూడదని ఉంటే సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు యథావిధిగా నడుస్తున్నాయి. ఈ బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు వేలంపాటలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ వేలంపాటలు రూ.లక్షల్లో ఉంటున్నాయి. కాట్రేనికోన మండలం చిర్ర యానం గ్రామంలో బెల్ట్ షాప్ నిర్వహించుకునేందుకు రూ.తొమ్మిదిలక్షలు75 వేలకు వేలంపాట జరిగింది. పల్లం గ్రామంలో నెలకు రూ.రెండు లక్షలు ఇచ్చేందుకు నిర్వాహకుడు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. బలుసుతిప్పలో యథావిధిగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారు మొల్లేటిమొగ రూ.నాలుగు లక్షలు, కొత్తపాలెం రూ.4లక్షలు, గొల్లగరువు రూ.1లక్షా50వేలు, రామాలయంపేట రూ.1లక్షా 20వేల చొప్పున వేలంపాటలు జరిగాయి. మరికొన్ని గ్రామాల్లో వేలంపాటలు నిర్వహించినందుకు ముహూర్తాలు పెట్టుకుంటున్నారు.

యానాం మద్యం జోరు

ముమ్మిడివరం నియోజకవర్గం కు ఆనుకుని కేంద్రపాలిత ప్రాంతమైన యానాం ఉండడంతో యానం మద్యం నియోజకవర్గంలో ఏరులై పారుతుంది. రోడ్డు, జల మార్గాల ద్వారా నియోజకవర్గానికి వచ్చి చేరుతుంది. తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో యానం మద్యంతోపాటు గోవా మద్యం కూడా దొరుకుతున్నట్లు తెలుస్తుంది. ఈ అక్రమ మద్యం అమ్మకాల ద్వారా కోట్లు గడించిన అక్రమార్కులు రాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం లాటరీ పద్ధతి ద్వారా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో నామమాత్రపు మద్యాన్ని మాత్రమే తీసుకెళ్లి దీని మాటున యానం మద్యాన్ని అమ్ముతున్నారు. ఈ విషయం ఎక్సైజ్ పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ అక్రమ వ్యాపారులకు రాజకీయ అండదండలు ఉండడంతో వీరు కిక్కురు మనటం లేదు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ దష్టికి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ నాయకులు కొంతమంది సిద్ధమవుతున్నట్లు సమాచారం.

అమలాపురంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరావు, మాల్యాద్రి

దాడులు ఆపకపోతే రాష్ట్ర స్థాయి ఉద్యమం

- ఎస్ సి, ఎస్ టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - అమలాపురం

దళితులపై దాడులు ఆపకపోతే రాష్ట్ర స్థాయి ఉద్యమం చేపడతామని కెవిపియస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న సిఐటియు కార్యాలయంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రంలో దళితులపై జరిగిన దుర్మార్గమైనా దాడులతో పాటు మండపేట దాడిని ఖండిస్తూ, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కోరుతూ జిల్లా కన్వీనర్ అయిబత్తుల తులసిరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో కెవిపియస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, న్యాయవాది వై.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కారేం వెంకటేశ్వరరావు, పౌరహక్కుల నాయకులు బాబురావు, దళిత సంఘాల నాయకులు సత్యనారాయణ, మోహనబాబు, తిరుపతి రావు, రాజేందర్, రాజేష్, శ్రీనివాస్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దుర్మార్గమైన దాడులు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలిసిన పాలకులు నిందితులకు కొమ్ముకాస్తున్నారు. రాష్ట్రంలో అన్ని స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరగడం లేదన్నారు. కమిటీలో పనిచేసే సంఘాలకు అవకాశం ఇవ్వాలని, సమావేశాలు రెగ్యులర్ నిర్వహించాలన్నారు. మండపేట గ్రామ దళితులను కట్టివేసి దారుణంగా దాడి చేసిన ఆధిపత్య కులస్తులు అందరిపై కేసులు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపి అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. ఈ దుర్మార్గమైన దాడుల్లో పాల్గొన్న వారందరినీ సోషల్ మీడియాలో ప్రచారంలో వచ్చిన వీడియో లో ఉన్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలన్నారు. దాడుల్లో పాల్గొన్న అందరిపై వీడియో పరిశీలన వెంటనే నిందితులను గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే ఉద్యమం చేస్తామన్నారు. దళిత యువకులకు మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. రాష్ట్రంలో ఇటీవల అనేక గ్రామాల్లో దళితులపై దారుణమైన దుర్మార్గమైన కుల వివక్షతతో కూడిన కుల అహంకార దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని నిరోధించేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు రక్షణ కల్పించాలన్నారు. దాని కోసం రాష్ట్ర, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశాలు జరపాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సబ్‌డివిజనల్, మండల స్థాయి కమిటీలు సమావేశాలు జరపాలని కోరుతు న్నామన్నారు. నేటికీ ఈ సమావేశాలు జరగక పోవడం బాధాకరమని, ఇప్పటికైనా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

5న పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటు నమోదు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

రాజోలు నియోజకవర్గం ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 5న పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటు నమోదు కార్యక్రమం మలికిపురంలో పూలే అంబేద్కర్ భవనం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారని నల్లి శివకుమార్, తోటే ప్రతాప్, చింతారాజ బాబు, గెడ్డం ఫిలిప్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు ప్రభుత్వం ప్రకటించినందున డిగ్రీ పట్ట భద్రులైన అంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే మరలా ఆరో తేదీ లోపు మీ ఓటు హక్కును నమోదు చేసు కోవాలన్నారు. ఇంతకుముందు ఉన్న ఓటు హక్కులు రద్దయ్యాని, అందువలన మరల అందరూ తమ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. కావలసిన పత్రాలు ఒరిజినల్ డిగ్రీ పట్టా లేదా ప్రొవిజనల్, ఆధార్ , ఓటర్ ఐడి, గుర్తింపు కార్డు, పాస్ పార్ట్ సైజ్ ఫొటో తెచ్చుకుని ఓటు నమోదు చేసుకోవాలని

యథేచ్ఛగా ఇసుక రవాణా

ప్రజాశక్తి - మామిడికుదురు

ఆదుర్రు, బి.దొడ్డవరం, లూటుకుర్రు, కరవాక తదితర గ్రామాల నుంచి అర్ధరాత్రి సమయములో అక్రమముగా ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్య లు చేపట్టం లేదని చెబుతున్నారు. వైనతేయ గోదావరి నుంచి పడవల ద్వారా రాత్రి సమయాల్లో ఒడ్డుకు చేర్చి ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తు న్నారని, అక్రమ రవాణా కు అధికారుల అడ్డుకట్ట వేయాలన్నారు.

పెండింగ్ డిఎలు, ఐఆర్ ప్రకటించాలి

కొత్తపేటలో ఎపి ఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం తీర్మానం

ఎపిఎన్‌జిఒ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-కొత్తపేట

కూటమి ప్రభుత్వం పెండింగ్ డిఎలు, ఐఆర్ వెంటనే ప్రకటించాలని కొత్తపేట తాలూకా యూనిట్ ఎపిఎన్‌జిఒ కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. కొత్తపేట తాలూకా యూనిట్ ఎపిఎన్‌జిఒ కార్యవర్గ సమావేశం ఆదివారం కొత్తపేట ఎన్‌జిఒ హోం నందు అధ్యక్షులు మోటూరి రామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఎపి ఎన్‌జిఒ సభ్యత్వ నమోదు మరియు ఎపి ఎన్‌జిఒ మాసపత్రిక సబ్ స్క్రిపషన్ ప్రక్రియలో భాగంగా ఉద్యోగులు అందరికీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంఘం తీర్మానించారు. పిఆర్‌సి నూతన కమిటీ ప్రకటించాలని, ఉద్యో గులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సంఘం తీర్మానం చేసి ఆమోదించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పూర్వపు అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, కార్యదర్శి నల్లా రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, ఉపాధ్యక్షులు నాగరాజు, జాయింట్ సెక్రట రీలు అరుణ సుందరి, రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

5న ఉపకరణాల అందజేతకు గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - రావులపాలెం

వికలాంగులకు అవసరమైన ఉపకరణాల సరఫరా చేసేందుకు గుర్తింపు శిబిరం ఎస్‌విఎస్ బాలురు ఉన్నత పాఠశాల్లో ఈ నెల 5న నిర్వహిస్తారని ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిమ్ కో సంస్థ ద్వారా నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో పరికరాలు సరఫరా చేయుటకు గుర్తింపు కొరకు మాత్రమే నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరం లో అప్పటికప్పుడు ఉపకరణములు, సహాయ పరికరములు ఇవ్వబడవన్నారు. గుర్తింపబడిన లబ్ధిదారులకు పంపిణీ తేదీ, ప్రదేశం తదుపరి తెలియజేస్తామన్నారు. శిబిరము నందు వికలాంగులు సమర్పించ వలసిన పత్రములు 1.బ్యాటరీ ఛార్జింగ్ సైకిల్ కు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. బ్యాటరీ ఛార్జింగ్ సైకిల్ పొందు వికలాంగులు వికలాంగత్వం 80 శాతం దాటి ఉండాలన్నారు. 2. ట్రై సైకిల్ కు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. 3. శ్రవణ యంత్రానికి ఆధార్ కార్డు, ఆడియో గ్రామ సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. 4. చంక కర్రలకు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. 5. టచ్ ఫోన్లు కు ఆధార్ , సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు, టెన్త్, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు, సైన్సు లాంగ్వేజి సర్టిఫికెట్. 6. వీల్ చైర్స్ కు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్. యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. 7.సీనియర్ సిటిజన్స్ వాకింగ్ స్టిక్‌కు ఆధార్ కార్డు, రేషన్ కార్డు. 8. బ్లైండ్ వాకింగ్ స్టిక్‌కు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యుడిఐడి కార్డు, రేషన్ కార్డు. 9. టిఎల్‌ఎమ్ కిట్‌కు ఆధార్ , సదరం సర్టిఫికెట్, యుడిఐడి, రేషన్ కార్డు తీసుకురావాలన్నారు.

వరి చేలు

కోతకు సిద్ధమైన వరి చేలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారీ వర్షాలు, తుఫీవన్లు వంటి ప్రకతి వైపరీత్యాలను ఎదుర్కొని తొలకరి పంటలు కోతకు సిద్ధమయ్యాయి. ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి రైతులు పండించిన తొలకరి పంటకు ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో అల్పపీడనాలతో రైతులను హడలెత్తించింది. మరో రెండు మూడు అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందన్న వార్తలతో రైతులు తొలకరి పంట చేతికి వస్తుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. కె.గంగవరం మండలంలో 15 వేల హెక్టార్లలో తొలకరి వరి పంట పండుతుంది. అదేవిధంగా రామచంద్రపురం మండల ంలో 17 హెక్టార్లలోను రైతులు వరి పండిస్తున్నారు. మొత్తం నియోజకవర్గంలో 50వేల హెక్టార్లు వరి పంట పూర్తిగా పండి కోతకు సిద్ధమైంది . అధిక శాతం రైతులు 90 శాతం స్వర్ణ రకాన్ని నాట్లు వేయగా పది శాతం బొండాలు ఇతర రకాలను పండించారు.ఇప్పటికే అక్కడక్కడ విత్తనాల వరి ధాన్యం కోతలు కోస్తుండగా మరో వారంలో పూర్తిగా పంట చేతికొచ్చే అవకాశం ఉంది. కోతల కోసం రైతన్నలు హార్వెస్టర్లను సిద్ధం చేసుకున్నారు. మరి కొద్ది రోజుల్లో ౦తులు పెద్ద ఎత్తున వరి కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మరో అల్పపీడనం పొంచి ఉందన్న వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు కలవర పడుతున్నారు. పూర్తిగా ప్రకతి పైన ఆధారపడిన వ్యవసాయం ఈ ఏడాది రైతులను ఈ విధంగా స ప ా క ్ రి స ్ ు ం దో న ని ఎదురుచూస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే నవంబర్ నెలాఖరుకు వరి కోతలు పూర్తయి తొలకరి పంటలు రైతులు చేతులకు వస్తాయని రైతన్నలు ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రకతి సహకరి స్తుందో లేదో అనేది వేచి చూడాల్సి ఉంది.

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో వివిధ ఆర్అండ్‌బి రోడ్లకు రూ.1.48 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆర్ అండ్ బి డివిజనల్ ఇంజినీర్ వి.సూర్యనారాయణ, ఆర్అండ్‌బి అసిస్టెంట్ ఇంజినీర్ వి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ కాలంగా భారీ గుంతలతో ప్రయాణికుల ఇబ్బందులు పడ్డ రహదారులపై 'ప్రజాశక్తి'ల్లో పలు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్పందించింది. రోడ్ల మరమ్మతులకు ఆర్ అండ్ బి శాఖకు నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో మండలంలోని జొన్నాడ - మండపేట రోడ్డుకు రూ.60 లక్షలు, వెదురుమూడి రోడ్డుకు రూ.60 లక్షలు గుమ్మిలేరు - నర్సిపూడి రోడ్డుకు రూ.20 లక్షలు, మడికి - దుళ్ల రోడ్డుకు రూ.8 లక్షలు నిధులు మంజూరైనట్లు డిఇ సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 4వ తేదీ లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, మరమ్మతులు చేపట్టి, త్వరితగతిన పనులు పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.

కార్తీక దీపారాధన ఉత్సవాలకు రాట ముహూర్తం

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ బోస్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో గల ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగే కార్తీక దీపారాధన మహోత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మండల అధ్యక్షులు అంబటి భవాని, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వెంకటాయపాలెం సర్పంచ్ ఎల్లమిల్లి సతీష్ కుమారి, కోటిపల్లి అబ్బు, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్తీక దీపారాధన ఉత్సవాల పోస్టర్ బోస్ ఆవిష్కరించారు.

కొత్తపేట కాంతి భారతి హైస్కూల్లో ప్రాంగణంలో వన సమారాధన

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పలుచోట్ల ఆదివారం ఘనంగా కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వనసమారాధనల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కొత్తపేట: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని స్థానిక కాంతి భారతీ హైస్కూల్ ప్రాంగణంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కార్యక్రమం లో గణపతి పూజ, సత్యనారాయణ స్వామి వారి వ్రతం, లక్ష పత్రి పూజ, హోమ కార్యక్రమాలు, రంగురంగులతో శివలింగ ఆకారం దీపారాధన తదితర కార్యక్రమాలు తోట వెంకటేశ్వరరావు, సత్యవాణి దంపతులు ఘనంగా నిర్వహించారు. వన సమాధానం పురస్కరించుకుని కాంతి భారతి విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులను, శివ భక్తులను ఆహ్వానించి సుమారు రెండువేల మందికి భోజనాలు ఏర్పాటుచేశారు. **మలికిపురం:** మలికిపురం సఖినేటిపల్లి మండలాల విశ్వబ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు, మానేపల్లి హరినాథ్, కొమ్మోజు హరీష్ కుమార్ ల ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురం బిసి కమ్యూనిటీ హాల్లో నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్, గుండుబోగుల పెదకాపు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగులు రాజోలు, అమలాపురం విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, దార్ల పాపాయచార్యులు, తాళబత్తుల అప్పలా చార్యులు విశ్వేశ్వరాయపురం గ్రామ సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, వార్డ్ మెంబరు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రహదారులపై ప్రత్యేక దృష్టి

బోళ్ల వెంకటరమణ

ప్రజాశక్తి - రాజోలు

కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించటంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మహర్దశ పట్టనుం దని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి, పెద్దా పురం నియోజకవర్గ పరిశీలకులు బోళ్ల వెంకటరమణ అన్నారు ఆదివారం రాజోలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేల చొప్పున పెన్షన్ ప్రతి నెలా 1న పింఛను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన ద్వారా జీవన ప్రమాణాలు పెంపొందించేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు సిఎం చంద్రబాబు రూ.826 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. 2014-2019లో చంద్రబాబు పాలనలో రూ.12 వేల కోట్లతో రోడ్ల నిర్మాణాలు జరిగితే.. వైసిపి ప్రభుత్వ హయాంలో గుత్తేదారులకు జగన్ బిల్లులు కూడా చెల్లించలేదని ఎద్దేవా చేశారు. వాగులు, కుంటలు, శ్మశాన స్థలాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, కనీసం ఒక్క కాలనీ కూడా పూర్తి చేయలేదన్నారు.

ఎంఎల్ఎకు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

వెంకన్న సన్నిధిలో ఉండి ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం ఉండి ఎంఎల్ఎ రఘురామకష్ణరాజు దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఉండి ఎంఎల్ఎకు ముందుగా ఆలయ డిసి నల్లం చక్రధర్ రావు మరియు అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి

వసతి గృహాలను సందర్శించిన డిసిసి అధ్యక్షులు చిట్టిబాబు

మామిడికుదురు హాస్టల్ సందర్శించిన చిట్టిబాబు

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని డి సి సి అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు అన్నారు. మామిడి కుదురు బాయ్స్ హాస్టల్ మరియు గర్ల్స్ హాస్టల్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షు లు కొండేటి చిట్టిబాబు హాస్టల్ ఆదివారం సందర్శించారు వసతులు గురించి, భోజనం సదుపాయాలు సౌకర్యాలు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు పిల్లలతోటి కలిపి బాయ్స్ హాస్టల్లో భోజనం చేశారు బాలుర హాస్టల్ భవనము శిథిల స్థితికి చేరుకుందని దీన్ని తక్షణమే పునరుద్ధరించాలన్నారు. హాస్టల్లో ఎక్కడికి అక్కడ డ్రయినేజీలో వాటర్ నిలిచిపోయి మురికి నీరు అపరిశుభ్రంగా ఉందని స్వచ్ఛత చర్యలు చేపట్టాలన్నారు. మూడు నెలలకు ఒకసారి చెల్లించి కాస్మోటిక్ చార్జీలు అందట్లేదని విద్యార్థులు విన్నవించారు ఈ విషయమై ఉన్నతాధికారులతో సంప్రదిస్తానని వాళ్ళకి భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అప్పన శ్రీ రామకష్ణ, పిసిసి సభ్యులు మాచవరపు శివన్నారాయణ., అమలాపురం టౌన్ ప్రెసిడెంట్ ఒంటెద్దు బాబి, అయితా బత్తుల సుభాషిని. బొంతు రాజేందర్, మొల్లేటి వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ ఢీకొని కార్మికుని దుర్మరణం

ప్రజాశక్తి - రావులపాలెం

ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి చనిపోయాడని ఎస్ఐ డి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కపిలేశ్వరపురం మండలం కేదార్లంక కు చెందిన వీధి శ్రీను (50) అరటి గెలలు మోటారు సైకిల్ పై రావులపాలెం మార్కెట్ యార్డు కు తీసుకొని వెళ్తుండగా లక్ష్మీపోలవరం లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వ్యాన్‌పై కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాకు కు గురై వ్యక్తి మరణించాడు. . ఈ ఘటన సంబంధించి ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపిన వివరాలు ఇవి.. చినగాడవిల్లికి చెందిన వివాహితుడు ఉండ్రు సతీష్ (28) గ్రామంలోని సోమలమ్మ డిబ్బి సమీపంలో శనివారం రాత్రి ఐషర్ వ్యాన్‌పై కొబ్బరికాయలు ఎగుమతి చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు అతని తగిలాయి. దీంతో అతను విద్యుత్ షాక్ కు గురై చనిపోయాడు. మతిని తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పేరవరం గౌతమి గోదావరి నదిలోంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను లారీలో తరలిస్తున్నారు. ఈ లారీని ఆదివారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ లారీని స్టేషన్‌కు తరలించి లారీ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి -ముమ్మిడివరం

అదనపు కట్నం కోసం భర్త ,అత్త మామలు వేధింపులకు గురి చేస్తున్నారని బాధిత మహిళ చేసిన ఫిర్యాదు మేరకు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి మండలంలోని లంక ఆఫ్ ఠానేలంకకు చెందిన కర్రీ స్వామి కుమార్తె ముత్యాలకు 2011 ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లా రామనగర్‌కు చెందిన శీలం సందీప్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.రెండు లక్షల నగదు ఇతర లాంచనాలు పుట్టింటి వారు సమర్పించారు. తమ కాపురం ఏడు సంవత్సరాలు సజావుగా జరిగిందని బాధిత మహిళ ముత్యాలు తెలిపింది. తమకు అబ్బాయి, అమ్మాయి ఉన్నారని తెలిపింది. ఇటీవల భర్త వ్యసనాలకు బానిసై పుట్టింటి నుండి అదనంగా కట్నం తీసుకురమ్మని వేధింపులు గురి చేస్తున్నాడని, దీనిపై కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా భర్త అత్తమామల ప్రవర్తనలో ఎటువంటి మార్పులు రాలేదని చెప్పింది. దీంతో తాను పుట్టింటికి వచ్చేవానని అయితే ఇటీవల తన భర్త తన ఇంటికి వచ్చి కొద్ది రోజులు తనతో సహజీవనం సాగించి మళ్లీ వేధింపులకు గురిచేసి కరీంనగర్ వెళ్ళిపోయాడని తెలిపింది. తాను వ్యవసాయ పనులు చేసుకుని పిల్లలను పోషించ కుంటున్నానని, తనకు అక్రమ సంబంధం అంటగట్టి తనను వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపింది. తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొంది. ఈ మేరకు ఎస్ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక బాలిక అదశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు అందించిన వివరాలు ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఎప్పటిలాగే శనివారం పాఠశాలకు వెళ్లింది. అయతే సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు మరియు బంధువుల ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు

దాడి చేసి నగలు, నగదు చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

ఇంటి యజమాని లేదని గ్రహించి గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఒక ఇంటిలోకి చొరబడి, తల్లి, ఆమె కుమార్తె చేతులు, కాళ్లు కట్టి, ఆపై రాడ్డుతో దాడి చేసి 30 కాసుల బంగారం, రూ.6 లక్షల నగదు, కొంత వెండి సామగ్రిని అపహరించుకుపోయారు. ఈ ఘటన మండలంలోని సాగిపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సాగిపాడు మెయిన్ రోడ్డును ఆనుకుని వ్యాపారి భమిడిపాటి శ్రీనివాస్ భవనం ఉంది. శ్రీనివాస్ తన చిన్న కూతురు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. పండుగకు ఆమె ఇంటికి వచ్చింది. కుమార్తెను హైదరాబాదులో దించేందుకు శనివారం రాత్రి సాగిపాడులో ప్రైవేట్ బస్సు ఎక్కరు. శ్రీనివాస్ భార్య శారద, అతని అత్త గరిమెళ్ళ సూర్యకాంతం ఇంట్లో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ముఖాలకు మాస్కులు పెట్టుకుని ఇంట్లోకి చొరబడ్డారు. శారద, సూర్యకాంతంల కాళ్లు చేతులు కట్టి రోడ్డుతో వారిని తలపై బలంగా కొట్టారు. చుట్టుపక్కల వారు చేరుకుని చూడగా రక్తపు మడుగులో ఉన్న శారద, సూర్యకాంతంలను గుర్తించారు. వెంటనే శ్రీనివాస్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. బాధితులను రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. దేవరపల్లి సిఐ నాగేశ్వరరావునాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి (రంగంపేట)

రంగంపేట మండలం కోటపాడు శివారు సుకృతి లేఔట్‌లో మాల ధరించిన ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు నాయకంపల్లికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి, ఇటీవలే ఫ్రెండ్స్‌తో కలిసి స్వామి మాల ధరించాడు. మూడు రోజుల క్రితం పెట్రోల్ పోసుకుని అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.కృష్ణ సాయి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షితమైన రోడ్లతోనే ప్రాంతాల అభివృద్ధి

ప్రజాశక్తితో జిల్లా రోడ్డు, భవనాల శాఖ ఇంజినీర్ ఎస్ఇ బి.రాము

ప్రజాశక్తి- అమలాపురం

వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధి సాధించాలంటే సురక్షితమైన రోడ్లు ఎంతైనా అవసరమని ఆ దిశగా గుంతలు రహిత రోడ్లను మిషన్ మోడ్ లో తీర్చిదిద్దాలని సంకల్పంతో నేడు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు మరమ్మతుల విషయంలో చోటు లేకుండా పటిష్టమైన చర్యలను తీసుకుందన్నారు. .గుంతలు రహిత మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 200 కిలోమీటర్ల మేర పడిన చిన్న చిన్న గుంతలు పూడ్చేందుకు ప్రస్తుతం రూ.17 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. రానున్న రోజులలో మరో రూ.40 కోట్లు మేర రోడ్ల మరమ్మతులకు నిధులు రానున్నాయని అన్నారు. రోడ్ల క్లియరెన్స్ కొరకు మరో రూ.20 కోట్లు నిధులు వస్తాయని ఆర్ అండ్‌బి శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.రాము తెలిపారు. పలు వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జిల్లాలో రహదారులు మరమ్మ తులు, నూతన రహదారుల నిర్మాణంపై ఎటువంటి చర్యలు చేపడతారు?

జిల్లాలో గుంతలు రహిత రోడ్లు మిషన్ మోడ్ కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం నుంచి కె.ఏనుగుపల్లి వరకు సుమారు 4.6 కిలోమీటర్ల మేర గుంతలు రహిత రోడ్లుగా తీర్చిదిద్దేందుకు రూ.1.70 కోట్ల అంచనా వ్యయంతో ఈ నెల 2న మరమ్మతు పనులకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, స్థానిక ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ లు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గుంతలు రహిత రోడ్లు మిషన్ మోడ్ కార్యక్రమం నిర్వహిస్తాము.

రహదారుల అభివృద్ధికి సంబంధించి ప్రస్తుత నిధులు ఎంతవరకు మంజూరు అయ్యాయి?

గుంతలు రహిత మిషన్ కింద జిల్లా వ్యాప్తంగా సుమారు 200 కిలోమీటర్ల మేర పడిన చిన్న చిన్న గుంతలు పూడ్చేందుకు ప్రస్తుతం రూ.17 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. వెంటనే పనులు ప్రారంభిస్తాం. మరో 40 కోట్ల నిధులు త్వరలోనే మంజూరు అవుతాయి.

జిల్లా అభివృద్ధి సాధించాలంటే రోడ్లు పాత్ర కీలకమైన మీరు భావిస్తున్నారా?

గుంతలు రహిత రోడ్లతో కూడిన జిల్లాగా కోనసీమ జిల్లాను తీర్చిదిద్దేందుకు రహదారులు భవనాలు శాఖ

చర్యలు చేపట్టిందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన ద్వారానే సుస్థిరాభివృద్ధి అనేది ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి ఆ దిశగా పలు కార్యక్రమాలకు నాంది పలుకుతోంది. గుంతలు రహిత మిషన్ కింద జిల్లా వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేస్తాం. తద్వారా జిల్లా అభివృద్ధి సాధిస్తాం.

వచ్చే వర్షాకాలం నాటికి జిల్లాలో రోడ్లు మరమ్మతుల కార్యక్రమం పూర్తవుతుందా?

ఆర్ అండ్ బి రోడ్లు తదుపరి పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మ తులకు రెండవ దశలో చేపడుతూ రానున్న వర్షా కాలం నాటికి ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని సదు ద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలు ఇంకా ఏమైనా రోడ్లు గుంతలు పడి ఉన్న రోడ్ల వివరాలను సంబం ధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తెస్తే వాటికి కూడా అను మతులు మంజూరు చేస్తూ పూర్తిస్థాయిలో పనులు నిర్వహణ చేపడతామన్నారు. రానున్న మార్చి, ఏప్రిల్ మాసాల నాటికి ఈ యొక్క పనులన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పుల్లలపాడు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రులో చికిత్స పొందుతున్నాడు. నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అనంతపురం నుంచి కాకినాడ కారులో ఇద్దరు మహిళలు వెళ్తున్నాడు. ప్రయివేటు డ్రైవర్‌ను పెట్టుకున్నారు. కారు నల్లజర్ల మండలం ముసుళ్ళగుంట సమీపానికి చేరేసరికి ఆగి ఉన్న లారీను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుసర్ల కనకదుర్గ(78) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక సీట్లో కూర్చొన్న కనకదుర్గ సోదరి సుర్ల శ్రీలక్ష్మి(82) తీవ్రంగా గాయపడింది. ఆసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో మార్గం మధ్యలో కన్నుమూసింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- కడియం

కడియం మండలం జేగురుపాడు శివాలయం వీధికి చెందిన వెళ్ళపల్లి శివ(30) అక్టోబర్ 29వ తేదీ మధ్యాహ్నం సమయంలో బర్త్‌డే ఫంక్షన కోసమని ఇంటినుంచి వెళ్లాడు. అప్పటినుంచి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శివ అన్నయ్య సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివ ఇంటి నుంచి వెళ్లే సమయంలో గ్రీన్ కలర్ షర్టు, వైట్ కలర్ ప్యాంటు ధరించినట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440796587 నెంబర్‌కు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారి పోలవరం కాలువ సమీపంలో మహిళ దారుణ హత్యకు గురైంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా కెడి.పేటకు చెందిన వెంకటలక్ష్మి(40) ఎనిమిదేళ్ల క్రితం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి వచ్చింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆమె హత్యకు గురైంది. హత్య జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. దర్యాప్తులో వివరాలు తెలియాల్సి ఉందని ప్రత్తిపాడు సిఐ సూర్యఅప్పారావు తెలిపారు.

హరిహర క్షేత్రంలో నక్షత్ర దీపాలంకరణ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక అనంతేశ్వరస్వామి ఆలయమంలో నక్షత్ర దిపాలంకరణ నిర్వహించారు. కార్తీకమాసం 30 రోజులు 30మంది దంపతులు ఈ నక్షత్ర దీపోత్సవం నిర్వహిస్తారు. తొలిరోజు మార్గాని గోవిందరాజు దంపతులు ఈ నక్షత్ర దీపాలంకరణ పూజలో పాల్గొన్నారు, ప్రత్యేక పూజల నిర్వహణకు యాత్రకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు.

భూమి పూజ చేస్తున్న సర్పంచ్ అరుణకుమారి తదితరులు

డ్రెయినేజీ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు పంచాయతీ పరిధిలోని జంగంపాలెం వద్ద ఆదివారం సర్పంచ్ నక్కా అరుణకుమారి డ్రైన్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైన్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నక్క చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది ఆదినారాయణ, చొల్లంగి శ్రీను, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : రవివర్మ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మండల తెలుగు యువత అధ్యక్షుడు పత్సమట్ల రవివర్మ అన్నారు. కర్రీవానిరేవు శివారు తోట్లపాలెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు వెంకటేశ్వర రావు తాటాకు ఇల్లు అగ్నిప్రమాదానికి ఆహుతై కుటుంబ సభ్యులు కట్టు బట్టలతో బయటపడ్డారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రవివర్మ బందం పరామర్శించి నిత్యావసర సరుకులు మరియు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ, ప్రెసిడెంట్ రేకాడి రాంబాబు, అయినవిల్లి వలియా బాబా, పెన్నాడ నాగబాబు, శివ, కుంచె ప్రసాద్, శ్రీనివాసరావు, పోతుమూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ ఆలయ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆదివారం దాత విరాళం అందజేశారు. తాపేశ్వరం వాసులు ఎరమాటి రత్నకుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఎరమాటి రత్నకుమార్ వారి తండ్రి పేరున ప్రతి సంవత్సరం. జులై 17న అన్నదానం నిర్వహించేందుకు స్వామివారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు వారికి స్వామివారి ఫోటో, ప్రసాదం అందజేశామన్నారు

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలి, ఫోర్ వీలర్స్ వాహనాల్లో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలి, తద్వారా సురక్షితంగా ప్రయాణం చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్, పుష్కర్ ఘాట్, కోటిపల్లి బస్టాండ్‌లలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు అభిషేక్ అహ్మద్, మురళీకృష్ణ, చైతన్య, అజీజ్ తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చాలామంది సీటు బెల్టు పెట్టుకోకుండా, హెల్మెట్ ధరించకుండా ప్రయాణాలు చేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే తప్పకుండా సీటు బెల్టు, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. ఇలాంటి మంచి అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు వాహన ప్రయాణికులకు అవగాహన కల్పించామన్నారు. ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తామని తెలిపారు. హెల్మెట్ లేనివాళ్లను ఆపి మరీ అవగాహన కల్పించారు.

రెండు కుటుంబాలకు రూ. 40 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల అద్దం పల్లి గ్రామంలో పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తూ మతి చెందిన కుటుంబానికి, ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ చివరి దశలో ఉన్న కుటుంబానికి రాష్ట్ర మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం చేయూతనందించారు. ఆదివారం రూ. 40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రామచంద్రపురం నియోజక వర్గం కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామ నివాసి మాసాబత్తుల అప్పారావు ఇటీవల మరణించాడు .ఆ పేద కుటుంబాన్ని రూ. 20 వేల సాయం , అదే విధంగా వట్రపూడి గ్రామ నివాసి సలా ఈశ్వరరావు తీవ్ర అనారోగ్యంతో మంచాన పడి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. అతని పేదరికం వల్ల ఇద్దరు ఆడపిల్లలు కళాశాల ఫీజులు కట్టే స్తోమత లేక ఇంటిలోనే ఉండి పోతున్నారు. విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న సత్యం ఆ కుటుంబాన్ని కూడా ఓదార్చి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు. డిగ్రీ చదువు మధ్యలో ఆపేసిన ఈశ్వరరావు కుమార్తెను చదివించే బాధ్యత తానే వహిస్తానని, చదువు అనంతరం అర్హత ఆధారంగా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందుకున్న రెండు కుటుంబ సభ్యులు వాసంశెట్టి సత్యానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ

ఆర్థిక సహాయం అందజేస్తున్న వాసంశెట్టి సత్యం తదితరులు

కార్యక్రమంలో కంచుమర్తి బాబురావు, పోలిశెట్టి నారాయణరావు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కోరుకొండ బాబ్జి

అమరజ్యోతి డాక్టర్ అంబేద్కర్ గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - యానాం

యానాం జనమిత్ర సంపాదకులు, రచయిత, కలైమామిణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన అమరజ్యోతి డాక్టర్ అంబేద్కర్ పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన భవన్‌లో ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానంరాజు సభకు అధ్యక్షత వహించారు. ఈ సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న వైసిపి మెడికల్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ గ్రంథాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ విష్ణుమూర్తి అమూల్యమైన గ్రంథం రాశారన్నారు. ఐదేళ్ల కషి ఫలితమే గ్రంథం అన్నారు. విష్ణుమూర్తి గొప్ప పరిశోధకుడు అన్నారు. అందరూ విధిగా చదవి ఆయా అంశాలను అవగాహన చేసుకోవాన్నారు. బౌద్ధ పరిశోధకులు పిల్లి రాంబాబు మాట్లాడుతూ గ్రంథంలోని అంశాలను విశ్లేషణ చేశారు. ఇటువంటి గ్రంథం రచించడం సామాన్యమైన విషయం కాదన్నారు. దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ విష్ణుమూర్తి ఎన్నో కొత్త విషయాలను గ్రంథాంలో పొందుపరిచారన్నారు. సభలో నామాడి అప్పారావు, డాక్టర్ కోరుకొండ భానుమతి, మోకా పావన్ కమార్, ముంగండ ఆశీర్వాదం, గిడ్డి బలరాం తదితరులు ప్రసంగించారు. ఇటీవల మృతి చెందిన బోయి విజయభారతికి సంతాపం తెలిపారు. సభలో కవి, కథకుడు పెనుమాక రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య లేమికి అధికారులే కారణం

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో కొద్దిరోజులుగా తాము పారిశుధ్య పనులు నిలిపివేయడానికి మున్సిపల్ అధికారులే కారణమని, సంస్థ చేసిన పనులకు బిల్లులు రాకుండా అడ్డుకుంటూ పుదుచ్చేరి ఎల్ఎడి శాఖ అధికారులకు తప్పుడు లేఖలు రాస్తున్నారని హెచ్ ఆర్ స్క్వేర్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ హెచ్ ఆర్ స్క్వేర్ సంస్థతో 15 ఏళ్ల పాటు యానాంలో పారిశుధ్యపనులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులు నిర్వహణకు పుదుచ్చేరి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. కానీ సంబంధిత సంస్థను ఏదోవిధంగా తప్పించి పూర్వపు సంస్థకు అప్పగించాలనే కుయుక్తితో సంస్థకు బిల్లులు రాకుండా అడ్డుపడుతున్నారన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులే రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ దీనికి బాధ్యత వహించాలన్నారు. తమకు 8 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, ఫణీంద్ర, కృష్ణప్రసాద్, అర్జున్ పాల్గొన్నారు.

రహదారుల ఛిద్రం.. పొంచిన ప్రమాదం..

ప్రజాశక్తి-కాజులూరు

గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు అభివృద్ధి చేయకపోవడంతో ప్రధాన రహదారులన్నీ పూర్తిగా ఛిద్రమై ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. కాజులూరు మండలంలోని గొల్లపాలెం-కుయ్యేరు ప్రధాన రహదారికి గత మూడు సంవత్సరాల క్రితం అప్పటి మంత్రి చెల్లు వేణుగోపాలకృష్ణ రూ.34 కోట్లతో నిర్మించే రహదారికి శంకుస్థాపన చేసినప్పటికీ ప్రస్తుతం అతీగతీ లేకుండా పోయింది. మండల కేంద్రమైన కాజులూరుకు వెళ్లాలంటే పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు వెళ్లేందుకు వెనకాడుతున్నారు. అధికారుల సైతం మండల కేంద్రానికి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రధాన రహదారులు ఇలా ఉంటే గ్రామాలకు చెందిన లింక్ రోడ్లు పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. దీంతోపాటు యానాం ద్రాక్షారామ మధ్యలో రోడ్లు భవనాల శాఖకు చెందిన రహదారిలో కోలంక వద్ద గుంత ఏర్పడడంతో ఆ రహదారిని మరమ్మతులు పంచాయతీ అధికారులు చేపట్టినప్పటికీ మరింత ప్రమాదకరంగా తయారయ్యింది. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు ఇక్కడకు వచ్చేటప్పటికి అత్యంత ప్రమాదకరంగా ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. కొద్ది రోజులుగా వర్షం కురవడంతో ఈ రహదారి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఎప్పుడు ఏ ప్రమాదం



యానాం ద్రాక్షారామ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్

గుంత లో దిగబడ్డ ఇటుక ట్రాక్టర్

ముంచుకొస్తుందోనని వాహనదారులు భయపడుతున్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే వాహనదారులు కోలంక వద్దకు వచ్చేసరికి గుంతలపై పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో తరచూ ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలవుతున్నారు. మండలంలోని గొల్లపాలెం, కుయ్యేరు రహదారికి సుమారు 13 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయవలసి ఉన్నప్పటికీ గ్రామాల మధ్య మాత్రం సిమెంట్ రోడ్లు ఉన్నాయి. మిగతా ప్రాంతంలో అడుగడుగునా గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం వాహనదారులకు ట్రాఫిక్కు జామ్ అవుతుండడంతో ప్రయాణాలను సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఈ రహదారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నిర్మాణానికి నిధుల కొరత ఉంది

రహదారుల నిర్మాణానికి నిధులు కొరత ఉంది. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. కోలంక వద్ద ఉన్న రహదారి ఛిద్రమైనప్పటికీ ఎటువంటి అనుమతులూ లేకుండా అక్కడ పనులు చేయడంతో మరింత నష్టం కలిగింది. ఆరు నెలల క్రితం మరమ్మతులు చేపట్టినప్పటికీ యధావిధిగా కొనసాగింది. అక్కడ మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు పిలిచాము. టెండర్లు ఆమోదం అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- లక్ష్మీ ప్రసన్న, ఆర్ అండ్ బి జూనియర్ ఇంజనీర్

త్వరితగతిన గోతులు పూడ్చాలి

యానం ద్రాక్షారామ రహదారిలో కోలంక వద్ద ఉన్న గుంతలో పలువురు పడి ప్రమాదానికి గురవుతున్నారు. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దూడల రామగంగారావు, స్థానికుడు కోలంక

స్కూల్ గ్రాంట్ రాక హెచ్‌ఎంల అవస్థలు

ప్రజాశక్తి - ఆలమూరు

స్కూల్ గ్రాంట్లు లేక పాఠశాలల నిర్వహణకు హెచ్‌ఎంలు నానా కష్టాలు పడుతున్నారు. చేసేది లేక సొంత నిధులతోనే పాఠశాలలకు మెటీరియల్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 1,570 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రాంటును నిర్ణయించింది. అందులో ఒకటి నుంచి 30 వరకు విద్యార్థులు ఉంటే రూ.10 వేలు, 31 నుంచి 100 మంది ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ. 50 వేలు, 251 నుంచి 1000 మంది ఉంటే రూ.75 వేలు, 1000 పైన విద్యార్థులు ఉంటే రూ. లక్ష, ప్రకారంగా ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలోనే గ్రాంటును విడుదల చేసేది. ఆ గ్రాంట్‌తోనే ప్రధానోపాధ్యాయులు పాఠశాలను నిర్వహించేవారు.

కరెంట్ బిల్లులు, చాక్ పీసులు, డస్టర్లు, వైట్ పేపర్లు,, చార్టులు, టీచింగ్ ఉపకరణాలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి కావలసిన మెటీరియల్స్ వంటివి కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ 2022 - 23 విద్యా సంవత్సరం, 2023 - 24 విద్యా సంవత్సరంతో పాటు, 2024 - 25 విద్యా సంవత్సరంతో మొత్తం మూడేళ్లుగా స్కూల్ గ్రాంట్స్ ను విడుదల చేయలేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలకు సంబంధించిన కరెంటు బిల్లులను చెల్లించకూడదని, గత ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. కానీ అందుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో విద్యుత్ శాఖ సిబ్బంది ప్రతినెల పాఠశాలలకు వచ్చి, కరెంట్ బిల్లు తీసి, చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, హెచ్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తనిఖీ చేస్తున్న సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఎందుకు పనిచేయడం లేదని, మరమ్మతులు ఎందుకు చేయించట్లేదంటూ హెచ్‌ఎంలను ప్రశ్నిస్తున్నారు. స్కూలు గ్రాంట్ రావడం లేదని చెబితే ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి బకాయిలతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంకు సంబంధించిన స్కూల్ గ్రాంట్స్ ను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే కరెంట్ బిల్లులు చెల్లింపులపై కూడా స్పష్టత ఇవ్వాలని వేడుకుంటున్నారు.

ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు కలిపి మూడేళ్ల నుంచి స్కూల్ గ్రాంట్స్ ను విడుదల చేయలేదు. కాని పాఠశాలల్లో కార్యక్రమాల్లో భాగంగా వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రైజులు ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో హెచ్‌ఎంలు తమ సొంత డబ్బులతో కావాల్సిన మెటీరియల్స్ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి స్కూల్ గ్రాంట్ ను విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హెచ్‌ఎంల అవస్థలపై త్వరితగతన స్పందించి నిధులు విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం.

దశల వారీగా నిధులు విడుదల చేస్తున్నాం

ప్రస్తుత ఏడాదితో పాటు కలిపి మూడేళ్లుగా పాఠశాలలకు స్కూలు గ్రాంట్స్ విడుదల చేయలేని మాట వాస్తవమే. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాం. త్వరలోనే నిధుల విడుదలకు కృషి చేస్తాం.

- విద్యా శాఖ అధికారి